క్లుప్తంగా

ఆంజనేయుడికి లక్ష తమలపాకుల పూజ



అద్దంకి రూరల్: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి పౌర్ణమి సందర్భంగా సోమవారం లక్ష తమల పాకుల పూజ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రాతఃకాల సుప్రభాత సేవ, గోపూజ, బిందెతీర్థం, అభిషేక కార్యక్రమాలనంతరం అర్చకులు 11 ఆవృత్తాలుగా ఆకుపూజ నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయ దాతలు మురకొండ శ్రీనివాసరావు, రాజేశ్వరీని అర్చకులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా మోహన్‌రావు



రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

వేటపాలెం: రోటరీ క్లబ్ ఆఫ్ వేటపాలెం నూతన అధ్యక్షుడిగా బట్టా మోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి రోటరీ క్లబ్ 2023–24 సంవత్సరం ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సెక్రటరీగా ఏవీ సురేష్‌బాబు, కోశాధికారిగా టీ కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. వీరిచేత రొటేరియన్ పీడీజీ పి శివన్నారాయణ, రొటేరియన్ పీహెచ్‌ఎఫ్ ఎం సుధీర్ ముఖ్య అతిథులుగా హాజరైన ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రొటేరియన్లు మున్నా నాగేంద్ర బాబు, కారంచేటి శివరామకృష్ణ, కొత్త వాసు, పీ రవికుమార్, గొల్లపూడి సీతారాం, ప్రత్తి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారానికి అడ్డుకట్ట



కుక్కలను తరలిస్తున్న సిబ్బంది

బల్లికురవ: మండలంలోని కొప్పరపాడు గ్రామంలో రెండు నెలలుగా కుక్కల స్వైర విహారంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అనేక మందిని గాయపరిచాయి. సోమవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ బండారు వెంకాయయ్య, సెక్రటరీ కేవీ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కుక్కలను పట్టి వాహనంలోకి ఎక్కించి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

గ్రానైట్ లారీల స్వాధీనం

బల్లికురవ: పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ లారీలను మైనింగ్ ఆర్‌ఐ రాజు ఆదివారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఉప్పుమాగులూరు గ్రామ సమీపంలో పర్మిట్ లేకుండా వెళ్తున్న రెండు లారీలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



బూదవాడలో కౌలు రైతుకు సీసీఆర్సీ కార్డు అందిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



ఇసుకదరిశి టీసీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి



పాతచీరాలలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అధికారులు



చీరాల ఏడో వార్డులో పత్రాలు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు, కమిషనర్

- పలు రకాల సర్టిఫికెట్లు అందజేసిన శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య
- సమస్యలు పరిష్కరించిన నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

జే.పంగులూరు/అద్దంకి రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం అని ఏపీ శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. మండల పరిధిలోని బూదవాడ, ముప్పవరం గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణచైతన్య మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమ పథకాలతో పాటు, రాష్ట్రం అభివృద్ధికి పరుగులిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటర్ వ్యవస్థతో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చిన గ్రామస్తులు పలకరించి వారి సమస్యను తెలుసుకొని పరిష్కార మార్గం చూపించారు. బూదవాడ, ముప్పవరం రెండు సచివాలయాలకు కలిపి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కుల ధ్రువీకరణ పత్రాలు 632, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 539, రైస్ కార్డులు 15, రేషన్ కార్డులు యాడింగ్ 35, రేషన్ కార్డులు షిఫ్టింగ్ 8, ఆధార్ అప్డేట్ 33, కౌలు రైతు గుర్తింపు కార్డులు 25 మందికి అందించినట్లు తెలిపారు. కార్యక్రమాలకు తహసీల్దార్ ఎ పద్మావతి, ఎంపీడీవో రామాంజనేయులు, జిల్లా వైఎస్సార్ సీపీ సేవా దళ్ వింగ్, మాజీ ఏఎంసీ చైర్మన్ పులికం కోటిరెడ్డి, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, సర్పంచ్ ఇన్నర్ల మార్తమ్మ, అంజనేయులు, ఎంపీటీసీ గంగాధర్, ఉప సర్పంచ్ గాదే బ్రహ్మారెడ్డి, గ్రామ నాయకులు శ్రీనివాసరెడ్డి, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి పట్టణంలోని రెండో సచివాలయ పరిధిలోని జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కృష్ణచైతన్య నిర్వహించారు. అనంతరం ఆదాయ 274, కుల ధ్రువీకరణకు 299, ఆధార్‌లింక్‌కు 30 సంబంధించినవి అర్జీదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మేష్, అనంతలక్ష్మి, కౌన్సిలర్‌లు, సచివాలయం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్కడికక్కడే 11 రకాల సేవలు..

చీరాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారమవుతున్నాయని జగనన్న సురక్ష మండల ప్రత్యేకాధికారి, జిల్లా రవాణాశాఖాధికారి చంద్రశేఖరరెడ్డి అన్నారు. సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా చీరాల మండలం బుర్లవారిపాలెం, పాతచీరాల గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందని అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. జగనన్న సురక్ష క్యాంపులు వద్ద నిర్ణీత తేదీల్లో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, మీ సమస్య అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. పట్టణంలోని 7వ వార్డులో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ యాతం జ్యోతి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ సచివాలయ స్థాయిలోని సమస్యలను పరిష్కరించి ప్రతి పౌరుడి ముఖంలో చిరునవ్వు చూడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.ప్రభాకర్, ఎంపీడీవో నేతాజీ, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, ఈవోఆర్డీ మురళీ బాపూజీ, ఇరిగేషన్ ఏఈ పవన్‌కుమార్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకం దేశానికే ఆదర్శం..

మార్టూరు: ప్రజల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న సురక్ష పథకం దేశానికే ఆదర్శమని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని ఇసుకదరిశి గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అత్యంత అవసరమైన 11 రకాలు సేవలను అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వారికి అందించటం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజా సమస్యల పట్ల గల చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఈ పథకం అమలులో గ్రామ వలంటీర్లది కీలక పాత్ర అని ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా సహించేది లేదని ఆమంచి హెచ్చరించారు. చిమ్మిరిబండ యూపీ పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అనుమతులు మంజూరు చేయించి సహకరించినందుకు ఆమంచిని గ్రామస్తులు ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అనంతరం మార్టూరు అంబేడ్కర్ కాలనీలో పార్టీ నాయకుడు అట్లూరి బాబు భార్య ద్వారక అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి ఆమె భౌతిక కాయానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ బాబు,ఎంపీడీఓ కే కృష్ణకుమారి, గ్రామ సర్పంచ్ సత్తెనపల్లి నారాయణమ్మ, ఎంపీపీ భుక్యా సునీతాబాయి, హౌసింగ్ డీఈ మురళి, ఎంఈఓ వస్రాం నాయక్, ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఈఓఆర్డీ సుబ్బారావు, స్థానిక నాయకుడు వినుకొండ సుధాకర్, సచివాలయ సిబ్బంది, మండల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే అవసరమైన ధ్రువపత్రాలు..



ఇతని పేరు గవిని శ్రీనివాసరావు బుర్లవారిపాలెం గ్రామం, చీరాల మండలం. ఆయనకు కుల ధ్రువీకరణ పత్రం అవసరమైంది. జగనన్న సురక్ష కార్యక్రమం గురించి తెలుసుకున్న శ్రీనివాసరావు వెంటనే వలంటీర్ ద్వారా అర్జీ పెట్టుకున్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో పేరు పిలిచి నాకు ధ్రువ పత్రం ఇచ్చారు. ఈ ప్రభుత్వంలో ఏ పనులైనా వెంటనే జరిగిపోతున్నాయి. గతంలో మండల కార్యాలయానికి వెళ్లి అధికారుల చుట్టూ తిరిగితేనే పత్రాలు వచ్చేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని సంతోషం వ్యక్తం చేశాడు.

ఈ ప్రభుత్వంలో కౌలు రైతులకు పెద్దపీట..



ఈవ్యక్తి పేరు పిట్లూరి రామాంజనేయులు. ఇసుక దరిశి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. వ్యవసాయం మీదనే ఆధారపడుతూ జీవనం సాగిస్తున్నాడు. కొంత పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తుంటాడు. గత ప్రభుత్వ హయాంలో కౌలుదారు కార్డుల కోసం నేను, నాలాంటి భూమిలేని రైతులు చాలా అగచాట్లు పడ్డాం. ఈ ప్రభుత్వం వచ్చాక గ్రామ వలంటీర్‌ల ద్వారా పైసా ఖర్చు లేకుండా మూడో ఏడాది కౌలుదారు కార్డు పొందుతున్నానని సంతోషం వ్యక్తం చేశాడు. సోమవారం జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది నంచి కౌలు కార్డులు అందుకున్నాడు.

జగనన్న సురక్షతో వెంటనే సమస్యల పరిష్కారం..



ఈ వ్యక్తి పేరు అరబ్రోలు కోటేశ్వరరావు, అద్దంకిలోని నంబూరిపాలెం. చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఇంట్లో వారికి ఆదాయ ధృవీకరణ పత్రం అవసరమైంది. వెంటనే వలంటీర్‌కు విషయం చెప్పాడు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం వెంటనే ఇంటికి వచ్చి పత్రం అందించడంతో సంతోషం వ్యక్తం చేశాడు.

క్షేత్రస్థాయి నుంచే పార్టీ బలోపేతానికి కృషి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్



వెంకటేశ్వర్లను పరామర్శిస్తున్న ఆమంచి

కారంచేడు: ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ వద్ద స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఆయన అనారోగ్యంతో ఉన్న దగ్గుబాటి వెంకటేశ్వర్లను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు, దగ్గుబాటి రామకృష్ణ, యార్లగడ్డ శ్రీకాంత్, దగ్గుబాటి సుధాకర్, యార్లగడ్డ పాపారావు, నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత భవిష్యత్



హెచ్‌ఎంకు కానుక ఇస్తున్న విద్యార్థులు

జే.పంగులూరు: విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఎంపీపీ తేళ్ల నాగమ్మ పేర్కొన్నారు. బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎ అనిత బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎంను సోమవారం ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు మాట్లడుతూ గత ఐదేళ్లగా పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల స్థాయిని పెంచే విధంగా హెచ్‌ఎం అనిత ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలికి చిరు సత్కారం అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బంగారు కొండ, సర్పంచ్ ఇన్నర్ల మార్తమ్మ, ఉప సర్పంచ్ గాదే బ్రహ్మారెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ ఈమని శ్రీరామిరెడ్డి, రాఘవరెడ్డి, బులిరెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం

- గడప గడపలో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



వృద్ధురాలితో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ చైతన్య

బల్లికురవ: పేద ప్రజల సంక్షేమమే జగనన్న ఆశయమని.. ఇందులో భాగంగానే నవరత్నాలు అందించి దేశంలో నంబర్ వన్ సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి నిలిచారని ఏపీ శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పాతమల్లాయపాలెం బీసీ కాలనీ, గ్రామంలో గడగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయా ఏమైనా సమస్యలు ఉన్నాయా తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్, బావట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ జూపల్లి రాఘవరావు, కొరాజుపాలెం సొసైటీ అధ్యక్షుడు ఒంగోలు సుబ్బారావు, స్థానిక నేతలు కల్లి అంజనీ ప్రసాదరెడ్డి , ముద్దపాటి శంకర్, అబ్బారెడ్డి బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, జూపల్లి లింగయ్య, సారెడ్డు శివరామరాజు, బండి గంగా ప్రసాద్, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, ఈవో అర్జునమతి, ఏవో కుమారి, సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పోలేరమ్మవారికి ఆభరణాలు బహూకరణ



అమ్మవారికి ఆభరణాలు సమర్పించిన గ్రామస్తులు

చినగంజాం: మండలంలోని రాజుబంగారుపాలెం పంచాయతీ శాంతినగర్ గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారికి గ్రామస్తులు ఆభరణాలు సమర్పించారు. గ్రామంలోని మహిళలు అందరూ చందాల రూపంలో నగదు సమకూర్చుకొని ఇత్తడి మకరతోరణం, కిరీటం, వెండి కళ్లు సుమారు రూ.40 వేలు ఖర్చుతో తయారు చేసి సోమవారం సమర్పించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పోలేరమ్మ ఆలయంలో హోమం, అభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను పమిడిపర్రు, పరాశరం రామాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

6న నూజిళ్లపల్లిలో వైద్య శిబిరం

జే.పంగులూరు: మండల పరిధిలోని నూజిళ్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 6వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్య శిబిరం సమన్వయ కర్త తాళ్లూరి రామాంజనేయులు, కిమ్స్ హాస్పిటల్ అద్దంకి ఏరియా కో ఆర్డినేటర్ పి కాలేషావలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి శుక్లాలు, పొరలు ఉన్నవారికి, సాధారణ వ్యాధులకు, గుండె సంబంధిత వ్యాధులకు, ఎముకలు, కీళ్ల నరాల వ్యాధులకు, గ్యాస్ ట్రబుల్ సమస్యలు ఉన్నవారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందిస్తారని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు




గొల్లపూడిలో సర్టిఫికేట్‌లు ప్రదానం చేస్తున్న ఎంపీడీవో

పర్చూరు (చినగంజాం)/మార్టూరు: అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశం అని ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్ అన్నారు. సోమవారం గొల్లపూడి సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గొల్లపూడిలో 229 మంది, చెరుకూరులో 255 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో చెరుకూరులో ప్రత్యేక అధికారి, డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయమ్మ, ఈఓ సత్యనారాయణ, పర్చూరులో తహసీల్దార్ సంధ్యశ్రీ, మండల జేసీఎస్ కన్వీనర్ ముప్పాళ్ల రాఘవయ్య, చెరుకూరు సర్పంచ్ సుబ్బారావు, గొల్లపూడి సర్పంచ్ ఎర్రాకుల రామకృష్ణ పాల్గొన్నారు.

➤ కడవకుదురు గ్రామంలో సర్పంచ్ జీ శివకుమారి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి వీ సూర్యనారాయణ, వీఆర్వో నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

➤ మార్టూరు మండలంలోని ఇసుక దరిశి, బొల్లాపల్లి గ్రామాల్లో అధికారులు రెండు టీంలుగా ఏర్పడి రెండో రోజు నిర్వహించిన జగనన్న సురక్ష పథకం ద్వారా లబ్ధిదారులకు మొత్తం 757 సర్టిఫికెట్లు పంపిణీ చేశామని తహశీల్దార్ సురేష్ బాబు తెలిపారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



వేటపాలెంలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



ఉప్పుమాగులూరులో బాబాకు అభిషేకం చేస్తున్న భక్తులు



పర్చూరు సాయిబాబా మందిరంలో క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్: గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సోమవారం ఉదయం నుంచే పలు ఆలయాల్లో బాబా విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాల్లో అన్నదానం కార్యక్రమాలు చేపట్టారు.

